సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం । 15 । అక్టోబర్ । 2025



'వైకుంఠం'లో నరకం !

అంతిమ సంస్కారాల కోసం గ్రామాల్లో నిర్మించిన వైకుంఠధామాలు పలుచోట్ల బాధిత కుటుంబాలకు నరకం చూపిస్తున్నాయి. IIలో



దీపావళికైనా వెలుగు నిండేనా?

పెండింగ్ వేతనాలు విడుదల కాకపోవడంతో జిల్లాలోని 14 ప్రభుత్వ జూనియర్ కళాశాలల గెస్ట్ లెక్చరర్లు ఇబ్బంది పడుతున్నారు. IIలో

గరిష్ఠం / కనిష్ఠం
31° / 22°

వాతావరణం

జిల్లాలో బుధవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. కొన్ని ప్రాంతాల్లో సాయంత్రం చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

22 నుంచి కార్తీక మాసోత్సవాలు

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని పెద్దమ్మ తల్లి ఆలయ సముదాయంలోగల శ్రీ అన్న పూర్ణా సమేత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 22 నుంచి నవంబర్ 20 వరకు కార్తీక మాసోత్సవాలు నిర్వహించనున్నట్లు ఈఓ ఎన్.రజనీకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరమ పవిత్రమైన కార్తీక మాసాన్ని పురస్కరించుకుని స్వామి వారికి నెలరోజుల పాటు తులసీ ఆరాధన, వేకువ జామున దీపారాధనలు, రుద్రాభిషేకం, కార్తీక మాస నిత్యాభిషేకాలు నిర్వహించనున్నట్లు వివరించారు. అలాగే సోమవారాలు, ఏకాదశి రోజుల్లో ప్రత్యేక పూజలు, మాస శివరాత్రి రోజున స్వామివారి కల్యాణ మహోత్సవం ఉంటాయని పేర్కొన్నారు.

ఫొటోగ్రఫీ, షార్ట్‌ఫిల్మ్ పోటీలకు ఆహ్వానం

కొత్తగూడెంటౌన్: పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర స్థాయి ఫొటోగ్రఫీ, షార్ట్ ఫిల్మ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ రోహిత్‌రాజు తెలిపారు. పోలీసుల త్యాగాలు, విధుల్లో ప్రతిభను తెలిపేలా ఇటీవల తీసిన మూడు ఫొటోలే కాక మూడు నిమిషాల నిడివితో షార్ట్ ఫిల్మ్ సమర్పించవచ్చని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈనెల 25 తేదీలోగా షార్ట్ ఫిల్మ్ పెన్‌డ్రైవ్, గతేడాది అక్టోబర్ నుంచి ఇప్పటివరకు తీసిన ఫొటోలను తమ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. అలాగే, డ్రగ్స్ నివారణలో పోలీసుల పాత్ర, విద్యార్థులు డ్రగ్స్ నుంచి దూరంగా ఉండాలనే అంశాలపై విద్యార్థులకు ఆన్‌లైన్‌లో వ్యాసరచన పోటీలను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఆరో తరగతి నుంచి పీజీ వరకు విద్యార్థులు తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ భాషల్లో రాసిన వ్యాసాలను ఈనెల 28వ తేదీలోగా సమర్పించాలని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో ముగ్గురికి బహుమతులు ఇవ్వడంతో పాటు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. వివరాలకు 87126 82121 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

నేడు జాబ్ మేళా

మణుగూరు రూరల్ : మండలంలోని ముత్యాలమ్మ నగర్ పంచాయతీ పరిధిలో గల మణుగూరు ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో బుధవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఐటీడీఏ పీఓ బి.రాహుల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగ గిరిజన యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నిరుద్యోగ గిరిజన యువతకు మెదక్ ఐటీసీ, ఇంటిగ్రేటెడ్ కన్స్యూమర్ గూడ్స్ తయారీ, లాజిస్టిక్ (ఐసీఎంఎల్) గందుపల్లి మెదక్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్ ఒకేషనల్‌తో పాటు ఐటీఐ చేసి, 18 నుంచి 29 సంవత్సరాలు ఉన్న వారు మిషన్ ఆపరేటర్ పోస్టులకు అర్హులని పేర్కొన్నారు. మొత్తం 40 సీట్లలో గిరిజన మహిళలకు ప్రాధాన్యత ఉంటుందని, ఆసక్తి గల గిరిజన యువత ఈనెల 15న జాబ్ మేళాకు హాజరు కావాలని సూచించారు. ఎంపికైన అభ్యర్థులు (ఐసీఎంఎల్) ఐటీసీ మెదక్ జిల్లాలో పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు.

16న కొత్తగూడెంలో..

సింగరేణి(కొత్తగూడెం): మెరీనా పెయింట్స్ ప్రైవేట్ లిమిటెడ్ తెలంగాణ పరిధిలో ఖాళీగా ఉన్న 2,190 పోస్టుల భర్తీకి ఈనెల 16న కొత్తగూడెం ఎంపీడీఓ కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి కొండపల్లి శ్రీరామ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 24 – 43 సంవత్సరాల మధ్య వయసు గల నిరుద్యోగులు, డిగ్రీ, ఐటీఐ, బీటెక్, ఎంటెక్, ఏఎన్ఎం, జీఎన్ఎం కోర్సులు చేసిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

డీర్ పార్క్‌కు పోలీస్ రక్ష



డీర్ పార్కు భద్రత కోసం నియమితులైన పోలీస్ సిబ్బంది

పాల్వంచరూరల్ : పర్యాటక ప్రాంతమైన కిన్నెరసాని డీర్‌పార్కు వద్ద రక్షణ కోసం ముగ్గురు కానిస్టేబుళ్లను నియమించారు. సెలవురోజుల్లో సందర్శకుల రద్దీ అధికంగా ఉంటుందని, వైల్డ్ లైఫ్ సిబ్బందికి దుప్పుల ఆలనా పాలనతోనే సరిపోతుందని, పర్యాటకుల భద్రత కోసం పోలీసులను ఏర్పాటు చేశామని ఎఫ్‌డీఓ బి.బాబు తెలిపారు. వీరిలో ఒక మహిళ, ఇద్దరు పురుష కానిస్టేబుళ్లు ఉండగా వైల్డ్‌లైఫ్ చెక్‌పోస్టు వద్ద ఒకరు, డీర్‌పార్కు వద్ద ఒకరు, బోటింగ్ పాయింట్ వద్ద మరొకరు విధులు నిర్వహిస్తారని వివరించారు.

చిక్కులకు చెక్ !

రైల్వే స్టేషన్ సమీపంలో పరిష్కారం కానున్న ట్రాఫిక్ సమస్య

- త్వరలో న్యూగొల్లగూడెం రోడ్డు విస్తరణ
- అవసరమైన స్థలం ఇచ్చేందుకు రైల్వే శాఖ అంగీకారం
- బదులుగా ఖమ్మంలో ఎకరం స్థలం కేటాయింపు



ట్రాఫిక్ సమస్య అధికంగా ఉండే సూపర్‌బజార్ - న్యూగొల్లగూడెం ఇరుకు రహదారి

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లా కేంద్రంలోని భద్రాచలం రోడ్ రైల్వే స్టేషన్ వద్ద నిత్యం ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ఈ సమస్య పరిష్కారానికి జిల్లా అధికారులు రైల్వే శాఖతో చర్చించగా.. సానుకూల ఫలితం వచ్చింది. దీంతో ఎదురుగడ్డ – హేమచంద్రాపురం రోడ్డు విస్తరణకు అడుగులు పడుతున్నాయి. ముఖ్యంగా రోడ్డు ఆరంభంలోనే బాటిల్ నెక్‌గా ఉన్న స్టేషన్ ప్రహరీని వెనక్కు జరిపేందుకు రైల్వే శాఖ సూత్రప్రాయంగా అంగీకారం తెలిపింది.

విస్తరణకు రైల్వే అడ్డంకి..

ఈ రహదారి విస్తరణకు గడిచిన ఐదేళ్లుగా ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. అయితే సూపర్ బజార్ – న్యూగొల్లగూడెం రోడ్డుకు ఒకవైపు భద్రాచలంరోడ్ రైల్వే స్టేషన్ ప్రహరీ ఉండగా.. మరోవైపు బడే మసీద్‌తో పాటు చిన్నబజార్, పెద్దబజార్, నేతాజీ మార్కెట్‌లకు సంబంధించిన దుకాణ సముదాయాలు ఉన్నాయి. దీంతో ఈ రోడ్డును విస్తరించడం కష్టంగా మారింది. పలుమార్లు నిధులు మంజూరైనా తన పరిధిలోని స్థలాన్ని ఇచ్చేందుకు రైల్వే శాఖ అంగీకారం తెలపలేదు. దీంతో రైల్వే ప్రహరీ దాటిన తర్వాతనే రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. రోడ్డు విస్తరణకు తాము కోల్పేయే స్థలానికి పరిహారంగా మరో చోట స్థలం ఇవ్వాలంటూ రైల్వే శాఖ సూచనలు చేసింది. దీంతో గతేడాది కారేపల్లి మండలంలో 15 ఎకరాల స్థలాన్ని పరిశీలించినా రైల్వేబోర్డు నుంచి సానుకూల స్పందన రాలేదు.

ఖమ్మంలో ఎకరం..

రోడ్డు విస్తరణ కోసం రైల్వేశాఖకు అనువైన స్థలం ఇచ్చేందుకు ఏడాది కాలంగా పలు స్థలాలను పరిశీలించారు. చివరకు ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్ ఏరియాలో నిరుపయోగంగా ఉన్న ఎకరం ప్రభుత్వ స్థలాన్ని గుర్తించారు. రైల్వే ట్రాక్‌కు పక్కనే ఉన్న ఈ స్థలం తీసుకునేందుకు రైల్వేశాఖ సైతం సుముఖత వ్యక్తం చేసింది. ఇందుకు బదులుగా కొత్తగూడెంలోని రైల్వే స్టేషన్ ఆరంభం నుంచి నేతాజీ మార్కెట్ వరకు 540 గజాల స్థలం ఇచ్చేందుకు అంగీకరించింది. దీంతో ప్రస్తుతం ఉన్న రోడ్డును పది గజాల మేరకు విస్తరించే వీలు కలిగింది. ఈ మేరకు జిల్లా యంత్రాంగం రైల్వేశాఖతో లిఖితపూర్వక సంప్రదింపులు ప్రారంభించింది. లాంఛనాలన్నీ పూర్తయితే అతి త్వరలోనే ఈ సమస్య పరిష్కారం కానుంది. ఈ రోడ్డు విస్తరణ కోసం ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి రైల్వేశాఖతో పలుమార్లు చర్చించారు.

ఆర్టీసీ బస్సులకూ అవకాశం..

గతంలో కొత్తగూడెం – ఇల్లెందు మధ్య నడిచే ఆర్టీసీ సర్వీసుల్లో కొన్నింటిని హేమచంద్రాపురం – కారుకొండ రామవరం మీదుగా నడపాలనే ప్రయత్నాలు జరిగాయి. అయితే రైల్వేస్టేషన్ దగ్గర రోడ్డు ఇరుకుగా ఉండడంతో ఈ ప్రతిపాదనలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఇప్పుడు రోడ్డు విస్తరణ పనులు పూర్తయితే ఈ మార్గంలో ఆర్టీసీ బస్సులు నడిపేందుకు అవకాశం కలుగుతుంది. తద్వారా ఈ మార్గంలో ఉన్న గ్రామాలకు రవాణా సౌకర్యం మెరుగవడంతో పాటు మహాలక్ష్మి పథకం మరింత చేరువవుతుంది. అంతేకాక ఈ మార్గం ఇల్లెందు, టేకులపల్లికి దగ్గరి దారిగా కూడా ఉంటుంది. ఇల్లెందు క్రాస్‌రోడ్‌తో పోల్చితే కనీసం ఐదు కిలోమీటర్ల దూరాభారం తగ్గుతుంది.

నిత్యం ట్రాఫిక్ జామ్..

కొత్తగూడెం నగరంలో సూపర్‌బజార్ సెంటర్ ప్రధాన కూడలిగా ఉంది. ముఖ్యంగా భద్రాచలంరోడ్ స్టేషన్ ప్రాంగణానికి సమీపంలో చిన్న బజార్, పెద్దబజార్, నేతాజీ మార్కెట్ ఏరియాలు ఉన్నాయి. ఈ మార్కెట్‌లో ఉన్న దుకాణాలకు అవసరమైన సరుకులను నిల్వ చేసే గోదాములు ఇదే రోడ్డులోని న్యూగొల్లగూడెం – ఎదురుగడ్డ – హేమచంద్రాపురం వద్ద ఉన్నాయి. ప్రస్తుతం ఈ రహదారి 30 ఫీట్లకు మించి లేకపోవడంతో సగటున ప్రతీ ఇరవై నిమిషాలకు ఒకసారి ఇక్కడ ట్రాఫిక్ జామ్ అవుతోంది. ముఖ్యంగా ఉదయం 10 గంటల ప్రాంతంలో, సాయంత్రం 6 నుంచి 7 గంటల సమయంలో ఈ మార్గంలో ప్రయాణం చేయడమంటే కత్తిమీద సామే అవుతోంది. రాత్రి 8 గంటలకు సింగరేణి రైలు వచ్చినప్పుడైతే ఈ రోడ్డు, సూపర్ బజార్ సెంటర్‌లో ఏర్పడే ట్రాఫిక్ పద్మవ్యూహాన్ని తలపిస్తోంది.

ధాన్యం కొనుగోళ్లు పారదర్శకంగా నిర్వహించాలి

అధికారులకు కలెక్టర్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్, పక్కన విద్యాశాఖ అధికారులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): వానాకాలం ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. ఐడీఓసీలో మంగళవారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 2,38,177 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు అంచనా ఉందని, అందులో సన్నరకం 2,02,862 మెట్రిక్ టన్నులు, దొడ్డు రకం 35,315 మెట్రిక్ టన్నులు ఉంటాయని తెలిపారు. ఈ ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు 193 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అవసరమైతే అదనపు కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఏ గ్రేడ్ ధాన్యం క్వింటా రూ. 2,389, సాధారణ రకానికి రూ.2,369 మద్దతు ధరగా ప్రభుత్వం నిర్ణయించిందని, సన్న ధాన్యానికి అదనంగా రూ. 500 బోనస్ ఇస్తుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో అన్ని వసతులు ఉండేలా చూడాలన్నారు. రైతులు పండించిన ప్రతీ గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని హామీ ఇచ్చారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని తక్షణమే ఆన్‌లైన్‌లో నమోదు చేసి మిల్లులకు తరలించాలన్నారు. ధాన్యం కొనుగోళ్లలో రైతులను అకారణంగా ఇబ్బంది పెడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్, ఆయా శాఖల అధికారులు రుక్మిణి, త్రినాథ్‌బాబు, శ్రీనివాస్, బాబురావు, వెంకటరమణ, మనోహర్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ భవన సందర్శన

కొత్తగూడెంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, రామవరం క్యాంపస్‌ని హాస్టల్ భవనాన్ని కలెక్టర్ పాటిల్ మంగళవారం సందర్శించారు. తరగతి గదిలో విద్యార్థులతో మాట్లాడి, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాల స్థలానికి హద్దులు నిర్ధారించి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని తహసీల్దార్‌కు సూచించారు. కార్యక్రమంలో బీసీ, ఎస్సీ సంక్షేమాధికారులు విజయలక్ష్మి, శ్రీలత, బీసీ గురుకుల ఆర్‌సీఓ రాంబాబు, సతీష్‌కుమార్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాను నిర్మూలిద్దాం

కొత్తగూడెంఅర్బన్: మనుషుల అక్రమ రవాణా నిర్మూలనలో ప్రజలు భాగస్వాములు కావాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ, రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణా మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మానవ అక్రమ రవాణా చాలా పద్ధతుల్లో జరుగుతోందని, అందరం కలిసి నివారించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఎంఓ నాగరాజు, ప్రజ్వల కో–ఆర్డినేటర్ శ్రావ్యశ్రీ తదితరులు మాట్లాడగా చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయులు ప్రధాన పాత్ర పోషించాలి..

పిల్లల సామర్థ్యాల పెంపుదలలో ప్రధాన ఉపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులు, కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. కొత్తగూడెంలోని జిల్లా విద్యా శిక్షణ కేంద్రంలో ప్రధానోపాధ్యాయుల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలో మౌలిక వసతుల అభివృద్ధి తన బాధ్యత అని, పిల్లల సామర్థ్యాల పెంపుదల కోసం కృషి చేసేలా ఉపాధ్యాయులను ఉత్తేజ పరచడం ప్రధానోపాధ్యాయుల బాధ్యత అని అన్నారు. నిరంతరం ఉపాధ్యాయులను ప్రోత్సహిస్తూ ఉత్తమ ఫలితాలు రాబట్టేలా చూడాలని కోరారు. పదో తరగతిలో 100 శాతం ఫలితాలు సాధించడానికి ఇప్పటి నుంచే ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.

పెండింగ్ కేసులు పరిష్కరించాలి

ఎస్పీ రోహిత్‌రాజ్



గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజ్

మణుగూరు టౌన్: పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించాలని ఎస్పీ రోహిత్‌రాజ్ పోలీస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన మణుగూరు పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. రికార్డులను పరిశీలించి సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశమై మాట్లాడారు. స్టేషన్‌లో నమోదవుతున్న కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది, అధికారుల సమస్యలపై ఆరా తీశారు. కార్యక్రమంలో డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సీఐ, ఎస్ఐ తదితరులు పాల్గొన్నారు.

యూనివర్సిటీ అభివృద్ధి అందరి బాధ్యత

కేయూ వైస్ చాన్స్‌లర్ ప్రతాపరెడ్డి



ఎన్ఎస్ఎస్ పీఓల సమావేశంలో మాట్లాడుతున్న వీసీ ప్రతాపరెడ్డి

ఖమ్మం సహకారనగర్: యూనివర్సిటీ అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని.. తద్వారా బోధన, పరిశోధనల్లో అగ్రగామిగా నిలుస్తామని కాకతీయ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కె.ప్రతాపరెడ్డి తెలిపారు. ఖమ్మంలోని యూనివర్సిటీ పీజీ కళాశాలను మంగళవారం ఆయన సందర్శించారు. కళాశాలలోని కంప్యూటర్ ల్యాబ్, గ్రంథాలయం, తరగతి గదులు, బోధనను పరిశీలించాక అధ్యాపకులతో సమావేశమయ్యారు. అధ్యాపకులు సమయపాలన పాటిస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని, తద్వారా వారు ఉన్నత స్థానాలకు ఎదుగుతారని తెలిపారు. ప్రిన్సిపాల్ రవికుమార్, అధ్యాపకులు, ఉద్యోగులు శ్రీనివాస్, రవి, కె.వెంకటనరసయ్య పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్‌లో భాగస్వాములు కావాలి

ఖమ్మం రాపర్తినగర్: ప్రతీ విద్యార్థి జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్)లో భాగస్వాములయ్యేలా అధ్యాపకులు అవగాహన కల్పించాలని కాకతీయ యూనివర్సిటీ వీసీ కె.ప్రతాపరెడ్డి సూచించారు. ఖమ్మంలోని గాయత్రి డిగ్రీ కళాశాలలో జరిగిన ఉమ్మడి జిల్లాస్థాయి ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్ఎస్ఎస్‌పై విద్యార్థులు ఆసక్తి పెంచుకునేలా అధ్యాపకులు చొరవ చూపాలన్నారు. యూనివర్సిటీ పరిధిలో అత్యధికంగా కళాశాలలు కలిగిన ఉమ్మడి ఖమ్మం జిల్లాకు అవసరమైన నిధులు కేటాయిస్తామని తెలిపారు. కరోనా కారణంగా ఎన్ఎస్ఎస్ కార్యకలాపాలకు ఆటంకం ఏర్పడినా.. గత ఏడాది నుంచి విస్తృతం చేశామన్నారు. కాకతీయ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఈసం నారాయణ, మేరా యువ భారత్ డిప్యూటీ డైరెక్టర్ చింతల అన్వేష్, ఖమ్మం జిల్లా ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ ఎం.శ్రీనివాసరావు మాట్లాడారు. భద్రాద్రి జిల్లా ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఆనంద్‌బాబు, ప్రియదర్శిని, గాయత్రి డిగ్రీ కళాశాలల కరస్పాండెంట్లు నవీన్‌బాబు, కె.సునీల్‌కుమార్, డైరెక్టర్ కుటుంబరావు, ఎన్ఎస్ఎస్ పీఓలు విల్సన్, ఎస్.జయప్రద తదితరులు పాల్గొన్నారు.

చారిత్రక సభకు సన్నద్ధం కావాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని



సమావేశంలో మాట్లాడుతున్న సాంబశివరావు

ఖమ్మంమయూరిసెంటర్: సీపీఐ శత వసంత ఉత్సవాల ముగింపు సభ డిసెంబర్ 26న జరగనున్నందున పార్టీ శ్రేణులను సన్నద్ధం చేయాలని రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు సూచించారు. ఖమ్మంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశం కర్నాటి భానుప్రసాద్ అధ్యక్షతన మంగళవారం జరగగా ఆయన మాట్లాడారు. వందేళ్ల కమ్యూనిస్టుల పోరాట చరిత్ర, త్యాగాలను నేటి తరానికి తెలియజేసేందుకు శత వసంత సంబరాల ముగింపు వేడుకలను ఖమ్మంలో ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. లక్షలాది మందితో జరిగే బహిరంగసభకు 40 దేశాల ప్రతినిధులు హాజరవుతారని చెప్పారు. ప్రజలు తరలివచ్చేలా ప్రత్యేక కళారూపాలతో ఇంటింటి ప్రచారం చేయాలని సూచించారు. కాగా, బీసీ రిజర్వేషన్ల విషయంలో కొన్ని పార్టీలు దొంగాట ఆడుతున్నాయని ఆరోపించిన కూనంనేని... బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు దక్కేలా జరిగే పోరాటాలకు తమ మద్దతు ఉంటుందని తెలిపారు. ఈసమావేశంలో సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహమ్మద్ మౌలానా, ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్ పాల్గొన్నారు.

వాణి వినేవారేరి ?



కలెక్టర్ లేకపోవడంతో ప్రజావాణిలో ఖాళీగా ఉన్న అధికారుల కుర్చీలు (ఫైల్)

- డివిజన్ కేంద్రాల్లో మసకబారుతున్న గ్రీవెన్స్
- హాజరు కాని అన్ని శాఖల అధికారులు
- కలెక్టరేట్‌లోనే నిర్వహించాలని కోరుతున్న ప్రజలు
- కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులు ఉండాలని విన్నపం



కొత్తగూడెం ఆర్డీఓ కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న డీఏఓ (ఫైల్)

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రజాసమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం మసకబారుతోంది. తమ సమస్యలు నేరుగా కలెక్టర్ దృష్టికి తీసుకొస్తే సమస్యలు పరిష్కారం అవుతాయని భావిస్తున్న ప్రజలకు ప్రజావాణి కార్యక్రమం వేదికగా మారింది. అయితే గత కొంతకాలంగా కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ రద్దుచేసి ప్రజల సౌకర్యార్థం కొత్తగూడెం, భద్రాచలంలో రెవెన్యూ డివిజన్ స్థాయిలో నిర్వహిస్తున్నారు. ఆయా కార్యక్రమాలకు డివిజన్ స్థాయి అధికారులు పూర్తిస్థాయిలో హాజరు కాకపోతుండగా ప్రజలు సైతం వెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదు. కొంతమంది కలెక్టరేట్‌కు వెళ్లి ఇన్‌వార్డులో ఫిర్యాదులు ఇస్తున్నా వాటిని అధికారులు అంతగా పట్టించుకోవడం లేదని తెలుస్తోంది. కలెక్టరేట్‌లో ప్రజావాణి నిర్వహించినప్పుడు జిల్లా నలుమూలల నుంచి వచ్చి సమస్యలపై దరఖాస్తులు అందజేసేవారు. నేరుగా కలెక్టర్ లేదా అదనపు కలెక్టర్‌కు సమస్యలు చెబితే అవి వెంటనే పరిష్కారం అయ్యేవి. ఒకవేళ మండలస్థాయి సమస్య అయితే సంబంధిత తహసీల్దార్ లేదా ఎంపీడీఓ, ఇతర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి సమస్య వివరించి దరఖాస్తులను వారికి ఎండార్స్ చేసేవారు. దీంతో ప్రజావాణి కార్యక్రమానికి వచ్చే వారు సంతృప్తి చెందేవారు.

అందుబాటులో ఉండని అధికారులు..

ఇటీవలి కాలంలో జిల్లా ఉన్నతాధికారులు తరచూ వివిధ పనులపై జిల్లాలోని పలు ప్రాంతాలకు వెళ్తుండడంతో కలెక్టరేట్‌లో అందుబాటులో ఉండడం లేదు. దీనికి తోడు ప్రజల సౌకర్యార్థం అంటూ డివిజన్ స్థాయిలో ప్రజావాణి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అయితే అక్కడ కూడా డివిజన్ స్థాయి అధికారులు కాకుండా ద్వితీయ, తృతీయ శ్రేణి అధికారులు, సిబ్బంది మాత్రమే వినతులు స్వీకరిస్తున్నారు. దీంతో సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ఇప్పుడు ప్రజలు అటు వెళ్లేందుకే ఆసక్తి చూపకపోగా.. ప్రజావాణి కార్యక్రమాలు వెలవెలబోతున్నాయి. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి కలెక్టరేట్‌లో ప్రజావాణి నిర్వహించాలని, నేరుగా కలెక్టరే వినతులు స్వీకరించి సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజావాణి క్రమం తప్పకుండా నిర్వహించాలి



ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించాలి. ప్రజలు ఎంతో ఆసక్తితో ప్రజావాణి కోసం ఎదురు చూసేవారు. తమ సమస్యలు పరిష్కారం అవుతాయని ఆశించేవారు. వందలాది మంది వచ్చి దరఖాస్తులను అందజేసే వారు. కలెక్టర్ స్పందించి ప్రజావాణిని కలెక్టరేట్‌లోనే నిర్వహించాలి.

– గూడ విజయ, కూలీలైన్, కొత్తగూడెం

నిరాశగా ఉంది



కలెక్టరేట్‌లో ప్రజావాణి నిర్వహించకపోవడంతో నిరాశగా ఉంది. కలెక్టరేట్‌కు వస్తే పలు సమస్యలు అక్కడికక్కడే పరిష్కారం అయ్యేవి. ఇటీవల ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించక పోవడంతో చాలామంది అసంతృప్తికి లోనవుతున్నారు. కలెక్టర్ స్పందించి ప్రజావాణి నిర్వహించాలని కోరుతున్నాం.

– ముర్రం వీరభద్రం, కొత్తపల్లి, దుమ్ముగూడెం మండలం

పేదల సమస్యల పరిష్కార వేదిక



పేదల సమస్యలకు పరిష్కార వేదికగా ఉన్న ప్రజావాణి కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లోనే కొనసాగించాలి. వందలాది మంది ప్రజావాణి కోసం ప్రతి సోమవారం ఎదురుచూస్తుంటారు. రెవెన్యూ డివిజన్ స్థాయిలో గ్రీవెన్స్‌లు సక్రమంగా జరగడం లేదు. కలెక్టర్ స్పందించి ప్రతి సోమవారం ప్రజావాణిని కలెక్టరేట్‌లోనే కొనసాగించాలి.

– బి. లాలు, గుండాల

అటవీ క్రీడా పోటీలకు 37 మంది ఎంపిక



శ్రీతేజతో కలెక్టర్, అధికారులు

పాల్వంచరూరల్ : ఇటీవల కొత్తగూడెంలో జరిగిన జిల్లా స్థాయి అటవీ క్రీడా పోటీల్లో ప్రతిభ చూపిన 37 మంది క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. హైదరాబాద్‌లోని ఫారెస్ట్ అకాడమీలో ఈనెల 17, 18 తేదీల్లో జరగనున్న రాష్ట్ర స్థాయి స్పోర్ట్స్ మీట్‌లో వీరు పాల్గొంటారని వైల్డ్‌లైఫ్ ఎఫ్‌డీఓ బి.బాబు, పాల్వంచ ఎఫ్‌డీఓ దామోదర్ రెడ్డి తెలిపారు.

జాతీయ అథ్లెటిక్స్‌లో స్వర్ణ పతకం

సూపర్‌బజార్(కొత్తగూడెం): అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఒడిశాలోని భువనేశ్వర్ కళింగ స్టేడియంలో సోమవారం రాత్రి ముగిసిన 40వ జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో కరకగూడేనికి చెందిన తోలెం శ్రీతేజ స్వర్ణ పతకం సాధించిందని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కె.మహీధర్ తెలిపారు. ఈ సందర్భంగా శ్రీతేజను కలెక్టర్ జితేష్ వి పాటిల్ మంగళవారం అభినందించారు. భవిష్యత్‌లో అంతర్జాతీయ స్థాయిలో కూడా రాణించాలని ఆకాంక్షించారు. శ్రీతేజ మాట్లాడుతూ కలెక్టర్ జితేష్ వి పాటిల్ ప్రోత్సాహంతో స్వర్ణ పతకం సాధించానంటూ కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా క్రీడల అధికారి ఎం. పరంధామరెడ్డి, కోచ్ నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు బూర్గంపాడు విద్యార్థిని..

బూర్గంపాడు: బూర్గంపాడుకు చెందిన మేకల సృజన రాష్ట్ర స్థాయి బాలికల ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని చిట్యాల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో చదువుతున్న సృజన ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది.

క్లుప్తంగా

108 వాహనంలో ప్రసవం



108లో తల్లీబిడ్డలతో సిబ్బంది

ములకలపల్లి: 108 వాహనంలో మహిళ ప్రసవించిన ఘటన మండలంలోని చింతపేట గ్రామంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రవ్వా మౌనికకు సోమవారం రాత్రి పురిటినొప్పులు రావడంతో ఆశ కార్యకర్త 108కు సమాచారం అందించారు. దీంతో 108 సిబ్బంది గ్రామానికి చేరుకొని, గర్భిణిని వాహనంలో తీసుకెళ్తుండగా మధ్యలో నొప్పులు అధికం కావడంతో రోడ్డు పక్కనే వాహనాన్ని నిలిపి ప్రసవం చేశారు. మౌనిక మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారని, మంగపేట పీహెచ్‌సీకి తరలించామని ఈటీఎం కళాధర్, పైలట్ రాజా తెలిపారు.

విద్యుత్ ఉద్యోగుల సాహసం



నీళ్ల మధ్యలో ఉన్న స్తంభం ఎక్కి మరమ్మతులు చేస్తున్న ఉద్యోగులు

పినపాక: విద్యుత్ పునరుద్ధరించేందుకు ఈ–బయ్యారం విద్యుత్ ఉద్యోగులు సాహసం చేశారు. రెండు రోజుల క్రితం కురిసిన అకాల వర్షం, పిడుగులకు మణుగూరు నుంచి బయ్యారం వచ్చే 33 కేవీ లైన్లో ఐలమ్మనగర్ చెరువు, తెర్లాపురం చెరువుల సమీపంలోని స్తంభాల్లో ఇన్సులేటర్ దెబ్బతిన్నది. మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడగా లైన్‌మెన్లు వెంకట్రావు, స్వామి, ఏఎల్‌ఎం కామేశ్ తెప్పపై వెళ్లి స్తంభం ఎక్కి మరమ్మతులు చేసి, విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. దీంతో ఉద్యోగులను పలువురు అభినందించారు.

కిన్నెరసానిలో గుర్రపుడెక్క..



జలాశయంలోకి కొట్టుకొచ్చిన గుర్రపుడెక్క..

పాల్వంచరూరల్: కిన్నెరసాని జలాశయంలో గుర్రపుడెక్క మొక్కలు పేరుకుపోయాయి. సోమవారం కురిసిన భారీ వర్షానికి ఎగువనుంచి వచ్చిన వరదలో ఇవి కొట్టుకువచ్చి, నీటిపై పరుచుకుంది. దీంతో నీరు పచ్చగా కనిపిస్తోంది. ఇలా వస్తున్న మొక్కలను గేట్ల మధ్య నుంచి బయటకు పంపించే ప్రయత్నాలు చేస్తున్నారు.

అండర్-14 కబడ్డీ జట్ల ఎంపిక

ఖమ్మంస్పోర్ట్స్: ఉమ్మడి జిల్లాస్థాయి పాఠశాలల విభాగంలో అండర్–14 కబడ్డీ జట్లను మంగళవారం ఎంపిక చేశారు. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహించిన ఎంపిక పోటీలను డీవైఎస్‌ఓ టి.సునీల్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం జట్ల వివరాలను జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి వై.రామారావు ప్రకటించగా.. ఈ జట్లు 16 నుంచి సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరువులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాయని తెలిపారు. ఉమ్మడి జిల్లా బాలుర జట్టుకు బి.ఓంకార్తీక్, పి.సంతోష్, డి.ధనుష్, వి.జయప్రకాష్, బి.ఆకాష్, ఎ.మనోజ్, ఎ.అరుణ్, బి.అంజిబాబు, ఎ.శివ, ఎస్.గోపి, పి.బాబు, ఎస్.ప్రతీక్, బాలికల జట్టుకు సీహెచ్.గాయత్రి, డి.యామినిశ్రీ, పి.ప్రవల్లిక, బి.వర్ష, పి.సింధుజ, ఎస్‌కే ఫరీదా, కె.భవాని, పి.జాస్మిన్, ఎం.లిఖిత, కె.వినయశ్రీ, జి.సృజన, ఎం.శ్రీజ ఎంపికయ్యారని వెల్లడించారు.

సీట్ల భర్తీకి 17న తుది గడువు

పాల్వంచరూరల్: సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 2025–2026 విద్యా ఏడాదికి గాను ఖాళీ సీట్ల భర్తీ కోసం ఈ నెల 17వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు గడువు నిర్దేశించారని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సమన్వయాధికారి ఎం.అన్వేశ్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. 6వ తరగతి నుంచి 9వ తరగతిలో ప్రవేశాల కోసం ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు ఐదో తరగతి ప్రవేశ పరీక్ష రాసి, దరఖాస్తు చేయని విద్యార్థులు, పరీక్ష రాయని విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ప్రవేశ పరీక్ష రాసిన వారు హాల్‌టికెట్, ర్యాంక్ కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో ఈ నెల 17వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు దరఖాస్తులు అందజేయాలని, ప్రవేశ పరీక్ష రాయనివారు దరఖాస్తు చేసుకుంటే కలెక్టర్ సమక్షంలో లాటరీ పద్ధతిలో ఎంపిక చేస్తామని ఆయన వివరించారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.19,400

వైకుంఠంలో నరకం !



అంత్యక్రియలకు మృతదేహంతో వాగు దాటుతున్న కిష్టారం గ్రామస్తులు(ఫైల్)

టేకులపల్లి మండలం కిష్టారం గ్రామస్తులు అంతిమ సంస్కారం కోసం పడుతున్న అవస్థలకు ఈ చిత్రం నిదర్శనం. ఎవరైనా చనిపోతే కుటుంబ సభ్యులు, బంధువులు ముర్రేడు వాగు దాటి వెళ్లాల్సి వస్తోంది. వర్షాలు పడి వాగు పొంగితే దహన సంస్కారాలకు అష్టకష్టాలు పడాల్సి వస్తోంది.



కిన్నెరసాని వాగు ఒడ్డున ఏర్పాటు చేసిన పినపాకపట్టీనగర్ వైకుంఠధామం

ఇది బూర్గంపాడు మండలం పినపాక పట్టీనగర్ వైకుంఠధామం. దీన్ని కిన్నెరసాని ప్రధాన వాగు పక్కనే ఏర్పాటు చేశారు. వర్షాకాలం వస్తే ఇక్కడ దహన సంస్కారాలకు ఇక్కట్లు తప్పవు. భారీ వర్షాలకు వాగు పొంగితే శ్మశానవాటిక వరద నీటిలో పూర్తిగా మునుగుతుంది. దీంతో అంత్యక్రియలకు ఆటంకం కలుగుతుంది. ఇవే కాకుండా జిల్లాలో చాలాచోట్ల వైకుంఠధామాల నిర్వహణ అధ్వానంగా మారింది.

ఆఖరి మజిలీ కోసం తప్పని అవస్థలు

- వర్షాల సమయంలో తీవ్ర ఇబ్బందులు
- వైకుంఠధామాల్లో వసతులు కరువు
- నిర్వహణను గాలికొదిలిన అధికారులు
- జిల్లావ్యాప్తంగా 481 శ్మశానవాటికలు

చుంచుపల్లి: అంతిమ సంస్కారాల కోసం గ్రామాల్లో నిర్మించిన వైకుంఠధామాలు బాధిత కుటుంబాలకు నరకం చూపిస్తున్నాయి. అనేక చోట్ల గ్రామాలకు దూరంగా ఉండడం, వసతులు సక్రమంగా లేకపోవడంతో దహన సంస్కారాలకు వచ్చే కుటుంబసభ్యులు, బంధువులు ఇబ్బంది పడుతున్నారు. కొన్ని చోట్ల వాగుల ఒడ్డున ఉండడంతో వర్షాలు కురిసినప్పుడు వాగులు పొంగితే అష్టకష్టాలు పడాల్సి వస్తోంది. జల వనరుల సమీపంలో నిర్మించిన శ్మశానవాటికలు మునిగిపోతుండగా అంత్యక్రియల నిర్వహణ అసాధ్యంగా మారుతోంది.

అత్యధికం.. అసౌకర్యాలే

జిల్లా వ్యాప్తంగా దాదాపు 60 శాతం శ్మశానవాటికల్లో సరైన వసతులు లేవు. చాలా చోట్ల విద్యుద్దీపాలు, నీటి వసతి లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఒక్కోసారి చీకట్లోనే అంతిమ సంస్కారాలు నిర్వహిస్తున్నారు. దహన సంస్కారాల అనంతరం స్నానాలు చేసేందుకు నీటి వసతి లేదు. చివరి మజిలీ గౌరవప్రదంగా జరగాలన్న ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం కేటాయించిన ఈజీఎస్ నిధులతో గత టీఆర్‌ఎస్ ప్రభుత్వం 2020–21లో రూ.లక్షల వ్యయంతో నిర్మించిన వైకుంఠధామాలు అలంకారప్రాయంగా నిలిచాయి. ప్రస్తుతం పంచాయతీల పర్యవేక్షణ లేక పలు వైకుంఠధామాల్లో పిచ్చి మొక్క లు, ముళ్ల పొదలు పెరిగి చిట్టడవిని తలపిస్తున్నాయి.

ఊరూరా వైంకుఠధామాలు

వ్యక్తి చనిపోయిన తరువాత ఆఖరి మజిలీ కార్యక్రమం సజావుగా సాగాలని 2021లో ప్రభుత్వం వైకుంఠధామాల నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ నిధుల నుంచి జిల్లాలోని 481 గ్రామ పంచాయతీల్లో ఒక్కో వైకుంఠధామానికి రూ.10 లక్షల నుంచి రూ.12.50 లక్షలు చొప్పున కేటాయించింది. మొత్తం రూ.52.91 కోట్లు ఖర్చు చేశారు. అప్పట్లో అత్యవసరంగా నిర్మించాలనే ఆదేశాలు రాగా.. కొన్నింటికి అనువైన స్థలాలు లభించక ఊరికి దూరంగా, మరికొన్నింటిని గుట్టలపై, నీటి వనరులకు సమీపాల్లో నిర్మించారు.

లక్ష్యం ఘనమే అయినా..

పల్లెప్రగతిలో భాగంగా చేపట్టిన ఈ వైకుంఠధామాల్లో మృతదేహాన్ని ఖననం చేయడానికి రెండు ప్లాట్‌ఫారాలతో పాటు స్త్రీ, పురుషులకు వేర్వేరు స్నానాల గదులు, మరుగుదొడ్లు, మహిళలు బట్టలు మార్చుకునే ప్రత్యేక గదులు, బోరుబావులను తవ్వించి నల్లాలు అమర్చాల్సి ఉంది. శ్మశానవాటికలకు ప్రహరీలు ఏర్పాటు చేసి మొక్కలను నాటించాల్సి ఉన్నప్పటికీ అనేక చోట్ల లేవు. వీటిని హడావుడిగా చేపట్టడంతో నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తగ్గినట్లు తెలుస్తోంది. కేవలం మృతదేహాన్ని ఖననం చేయడానికి ప్లాట్‌ఫారాలు, శ్మశాన వాటికకు సంబంధించిన బోర్డు కోసం ద్వారాలు, ఒకటి అర గదులను మాత్రమే తూతూమంత్రంగా నిర్మించి వదిలేశారు. నిర్వహణ బాధ్యతను జీపీలకు అప్పగించగా.. తొలినాళ్లలో కొంతమేర పర్యవేక్షించినా, తరువాత పట్టించుకోవడం మానేశారు. ఇక ఏడాదిన్నరగా జీపీల్లో ప్రజాప్రతినిధులు లేకపోవటం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి సక్రమంగా ఆర్థిక సంఘం నిధులు సైతం రాకపోవడంతో వైకుంఠధామాల నిర్వహణను పూర్తిగా గాలికొదిలేశారు. నాలుగేళ్ల క్రితం నిర్మించిన వైకుంఠధామాల్లో ప్రస్తుతం చాలా వరకు పలు కారణాలతో నిరుపయోగంగా మారాయి. వర్షాలు పడినప్పుడు వాగుల పక్కన ఏర్పాటు చేసిన వైకుఠధామాల వద్ద అంత్యక్రియలు నిర్వహించలేని దుస్థితి నెలకొంది.

అంతర్ కళాశాలల టోర్నీలో జయకేతనం

సూపర్‌బజార్(కొత్తగూడెం): వరంగల్ జిల్లా బొల్లికుంటలోని వాగ్దేవి కాలేజీలో ఈ నెల 11 నుంచి 13 వరకు నిర్వహించిన మహిళల అంతర్ కళాశాలల క్రీడా పోటీల్లో కొత్తగూడెం సింగరేణి మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలోని 100 కళాశాలల విద్యార్థులు పాల్గొనగా, సింగరేణి కళాశాల విద్యార్థినులు వివిధ విభాగాల్లో పతకాలు సాధించడమే కాక ఓవరాల్ చాంపియన్ షిప్ దక్కించుకున్నారు. వివిధ అంశాల్లో ఎం.ఇందు, ఎం.సంగీత, ఎం.సింధు, కుమారి, డి.పూజిత విజేతలుగా నిలిచారు. అలాగే, బెంగళూరులో జరగనున్న అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయ స్థాయి టోర్నీకి పలువురు ఎంపికయ్యారు. విద్యార్థినులను సింగరేణి డైరెక్టర్ గౌతమ్ పాత్రుతో పాటు కాలేజీ అధ్యాపకులు డాక్టర్ కె.సావిత్రి, డాక్టర్ కె.రాజ్యలక్ష్మి తదితరులు మంగవారం అభినందించారు.



విద్యార్థినులను అభినందిస్తున్న సింగరేణి డైరెక్టర్ గౌతమ్ పాత్రు

దీపావళికైనా వెలుగు నిండేనా?

- ఈ పండుగ పూట కూడా పస్తులేనా?
- గెస్ట్ లెక్చరర్ల వేతనాలపై పట్టించుకోని పాలకులు, అధికారులు



టేకులపల్లి: పాలకుల పట్టింపు లేక, ఉన్నతాధికారుల నిర్లక్ష్యం వల్ల గెస్ట్ లెక్చరర్లు పండుగ పూట కూడా పస్తులుండాల్సిన దుస్థితి నెలకొంది. ఎన్నో ఆశలతో గెస్ట్ లెక్చరర్లుగా చేరి రెగ్యులర్, కాంట్రాక్ట్ అధ్యాపకులతో సమానంగా పనిచేస్తున్న గెస్ట్ లెక్చరర్ల బాధలు వర్ణనాతీతం. రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో 1,654 మంది గెస్ట్ అధ్యాపకులు పనిచేస్తుండగా ఇటీవల చేపట్టిన నియామకాల్లో రెగ్యులర్ అధ్యాపకులు నియమితులు కావడంతో 1,200 మంది గెస్ట్ లెక్చరర్లు ఇంటి బాట పట్టాల్సి వచ్చింది. అందులో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 14 ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో 54 మంది అతిథి అధ్యాపకులు పనిచేస్తుండగా ఈ విద్యా సంవత్సరం నియామకాల కారణంగా 24 మంది ఇంటిబాట పట్టారు. వీరికి డిసెంబర్ 15 నుంచి మార్చి 31 వరకు వేతనాలు చెల్లించాల్సి ఉంది. వీరితో పాటు కాలేజీల్లో కొనసాగుతున్న గెస్ట్ లెక్చరర్లకు కూడా వేతనాలు లేవు. పెండింగ్ వేతనాలు విడుదల కాకపోవడంతో కుటుంబ పోషణ కష్టంగా మారింది. అప్పులు చేసి జీవనం సాగిస్తున్నట్లు పలువురు వాపోయారు. గెస్ట్ అధ్యాపకులకు పీరియడ్‌కు రూ.390 చొప్పున నెలకు 72 పీరియడ్లు బోధించాల్సి ఉంటుంది. నెలలో 72 పీరియడ్లు బోధిస్తేనే రూ.28,080 వేతనం వస్తుంది. ఇది కూడా నెలనెలా రాదు. మూడు నాలుగు నెలలకు ఒకసారి వేతనాలు ఇచ్చేవారు. అసలే చాలీచాలని వేతనం, ఆపై ఆలస్యంగా వస్తుండటంతో తీవ్ర ఇబ్బందులు పడేవారు. దసరా పండుగకు వేతనాలు వస్తాయని ఎదురు చూసినా వారికి నిరాశ ఎదురైంది. కనీసం దీపావళికైనా పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని గెస్ట్ అధ్యాపకులు కోరుతున్నారు.

ప్రభుత్వం స్పందించాలి



రెగ్యులర్, కాంట్రాక్టు అధ్యాపకులతో సమానంగా విధులు నిర్వహించాం. రెగ్యులర్ లెక్చరర్లు రావడంతో మాకు పని లేకుండా పోయింది. చేసిన పనికి సంబంధించి 2024 డిసెంబర్ 15 నుంచి మార్చి 31 వరకు వేతనం నేటికీ ఇవ్వలేదు. దసరా పండుగ సమయంలోనూ రాలేదు. కనీసం దీపావళికైనా వేతనాలు వస్తాయని ఎదురు చూస్తున్నాం. ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పెండింగ్ వేతనాలు ఇచ్చేలా కృషి చేయాలి.

– బాదావత్ రంజిత్‌కుమార్, టేకులపల్లి

44.6 కేజీల గంజాయి స్వాధీనం



గంజాయి, నిందితులను చూపుతున్న అధికారులు

భద్రాచలంఅర్బన్: ద్విచక్రవాహనాలపై గంజాయి తరలిస్తుండగా పట్టణంలోని కూనవరం రోడ్డులోని ఆర్టీఏ చెక్‌పోస్ట్ వద్ద ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం పట్టుకున్నారు. వివరాలిలా ఉన్నాయి.. ఆర్టీఏ చెక్‌పోస్ట్ వద్ద ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్ తిరుపతి ఆధ్వర్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌ఐ శ్రీహరి, సిబ్బంది వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో వరుసగా వస్తున్న మూడు ద్విచక్రవాహనాలను ఆపి తనిఖీ చేయగా 44.6 కేజీల ఎండు గంజాయి దొరికింది. సూర్యాపేట జిల్లాకు చెందిన బానోతు మహేశ్, గుగులోతు అశోక్, కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు చెందిన రిజ్వాన్‌పాషా, ఇమ్రాన్‌పాషా, మంజునాథ, కేశవ్ కలిసి.. ఒడిశాలోని సీలేరులో గంజాయి కొనుగోలు చేసి హైదరాబాద్, బెంగళూరుకు తరలిస్తూ పట్టుబడ్డారని అధికారులు తెలిపారు. నిందితులను భద్రాచలం ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించామని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు చెప్పారు. తనిఖీల్లో ఎక్సైజ్ హెడ్‌కానిస్టేబుళ్లు కరీం, బాలు, కానిస్టేబుళ్లు సుధీర్, హరీశ్, విజయ్, వీరబాబు, ఉపేందర్ పాల్గొన్నారు.

కారు బానెట్‌లో గంజాయి తరలింపు !

వేడికి నిప్పంటుకుని పొగలు రావడంతో పరారీ

పాల్వంచ: గంజాయి స్మగ్లర్లు పోలీసులకు చిక్కకుండా రోజుకో కొత్త మార్గాన్ని ఎంచుకుంటున్నారు. గతంలో లారీల కింద అరలు ఏర్పాటు చేసి తరలించగా ఇప్పుడు కారు బ్యానెట్‌లో గంజాయి తరలిస్తున్నట్లు బయటపడింది. గుర్తుతెలియని ముగ్గురు వ్యక్తులు మంగళవారం కారు (ఒడీ 30జీ 8729) ముందు ఇంజన్ భాగంలో గంజాయి ప్యాకెట్లు దాచి తరలిస్తున్నారు. పాల్వంచకు కారు చేరుకోగా ఇంజన్ వేడికి గంజాయి అంటుకుని పొగలు మొదలయ్యాయి. దీంతో వాటర్ సర్వీస్ సెంటర్‌కు తరలించి బానెట్ తెరవగానే గంజాయి ప్యాకెట్లు బయటపడ్డాయి. సిబ్బంది ఆరా తీస్తుండగా ఓ మహిళతో కూడిన ముగ్గురు పరారయ్యారు. దీంతో పోలీసులకు సమాచారం ఇవ్వగా రూ.30 లక్షల విలువైన 60 కేజీల గంజాయి తరలిస్తున్నట్లు గుర్తించారు. స్మగ్లర్ల కోసం గాలిస్తున్నట్లు పాల్వంచ ఎస్‌ఐ సుమన్ తెలిపారు. పోలీసుల తనిఖీలను తప్పించుకునేందుకు బానెట్‌లో గంజాయి ప్యాకెట్లు పెడుతూ, పట్టణాలు దాటాక బయటకు తీస్తున్నట్లు భావిస్తున్నారు. అయితే, ఇంజన్ వేడికి మంటలు అంటుకోవడంతో స్మగ్లర్ల వ్యూహం బెడిసికొట్టింది.



బానెట్‌లో కాలిపోతున్న గంజాయి ప్యాకెట్లు

గుడుంబా స్థావరాలపై దాడులు

113 లీటర్ల నాటుసారా స్వాధీనం



నిందితులు, నాటుసారాను చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

బూర్గంపాడు: మండలంలోని సారపాక, ఇరవెండి గ్రామాల్లోని గుడుంబా స్థావరాలపై మంగళవారం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించి, బెల్లం పానకం ధ్వంసం చేశారు. భారీగా నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ తిరుపతి వివరాలు వెల్లడించారు. సారపాక, ఇరవెండి గ్రామాల్లో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, సిబ్బంది సుమారు 600 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. గుడుంబా తయారీ, విక్రయాలకు పాల్పడుతున్న 9 మంది (మహిళలు సైతం)ని అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం వారి వద్ద నుంచి సుమారు 113 లీటర్ల నాటుసారా, 3 సెల్‌ఫోన్‌లు చేసుకున్నారు. నిందితులపై కేసులు నమోదు చేసి, భద్రాచలం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌కు తరలించామని ఏఈఎస్ తిరుపతి తెలిపారు. మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలు జరిగితే టోల్ ఫ్రీ నంబర్ 1800 – 4252523కు సమాచారమివ్వాలని ఆయన సూచించారు. దాడుల్లో హెడ్‌కానిస్టేబుళ్లు కరీం, బాలు, కానిస్టేబుళ్లు సుధీర్, హరీశ్, విజయ్, వీరబాబు, ఉపేందర్ పాల్గొన్నారు.

600 క్వింటాళ్ల బియ్యం సీజ్

నిర్ధారణ కోసం ల్యాబ్‌కు శాంపిళ్లు

నేలకొండపల్లి: మండలంలోని కొత్తకొత్తూరు గ్రామంలో ఓ రైస్ మిల్లులో నిల్వ ఉన్న బియ్యాన్ని సివిల్ సప్లయీస్ అధికారులు సీజ్ చేశారు. వివరాలిలా ఉన్నాయి.. రైస్‌మిల్లులో పీడీఎస్ బియ్యం నిల్వ చేశారనే సమాచారంతో జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి చందన్‌కుమార్ ఆధ్వర్యాన మంగళవారం సివిల్ సప్లయీస్, టాస్క్‌ఫోర్స్, పోలీసులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దాదాపు 600 క్వింటాళ్ల బియ్యాన్ని సీజ్ చేయడంతో పాటు పీడీఎస్ బియ్యమా, కాదా? అని నిర్ధారణ కోసం శాంపిళ్లను ల్యాబ్‌కు పంపించారు. ల్యాబ్ నుంచి నివేదిక వచ్చాక తదుపరి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. కాగా, భారీగా బియ్యం పట్టుబడడంతో ఎక్కడ సేకరించారు, ఎవరు కొనుగోలు చేశారనే కోణాల్లో ఆరా తీస్తున్నారని తెలిసింది. తనిఖీల్లో డిప్యూటీ తహసీల్దార్ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రెండు ద్విచక్రవాహనాలు ఢీ..

రిటైర్డ్ ఏఎస్‌ఐ మృతి



నార్లపాటి జగ్గారావు మృతదేహం

అశ్వారావుపేటరూరల్: రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో రిటైర్డ్ ఏఎస్‌ఐ మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం ఏపీలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలోని పేరాయిగూడేనికి చెందిన, రిటైర్డ్ ఏఎస్‌ఐ నార్లపాటి జగ్గారావు (63) ద్విచక్రవాహనంపై ఏపీలోని ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలంలోని మద్ది ఆంజనేయస్వామి ఆలయానికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తున్నాడు. ఈ క్రమంలో జల్లేరు వద్ద ఎదురుగా వచ్చిన మరో ద్విచక్రవాహనం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో జగ్గారావుకు తీవ్ర గాయాలు కాగా జంగారెడ్డిగూడెం ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. జగ్గారావు అశ్వారావుపేట పోలీస్ స్టేషన్‌లో ఏఎస్‌ఐగా పనిచేసి, ఉద్యోగ విరమణ పొందారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

పామాయిల్ గెలల చోరీపై కేసు

ములకలపల్లి: పామాయిల్ తోటలో గెలలు అక్రమంగా నరికి, తరలించిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ మధుప్రసాద్ కథనం మేరకు.. మండలంలోని మొగరాలగుప్ప గ్రామానికి చెందిన కీసరి లక్ష్మణ్‌రావు పామాయిల్ తోటలో ఈ నెల 10న పక్వానికి వచ్చిన 5 టన్నుల గెలలు చోరీకి గురయ్యాయి. సోయం నాగేశ్వరరావు, సోయం లలిత గెలలు చోరీ చేశారని భాస్కర్‌రావు మంగళవారం లిఖిత పూర్వక ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

చోరీలకు పాల్పడుతున్న ఆరుగురి అరెస్ట్

ముఠాలో భద్రాద్రి జిల్లా వాసులు

నర్సంపేటరూరల్: తాళం వేసి ఉన్న ఇళ్లే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్న ముఠాను అరెస్ట్ చేసినట్లు వరంగల్ జిల్లా నర్సంపేట ఏసీపీ రవీందర్‌రెడ్డి తెలిపారు. నర్సంపేట పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఆయన వివరాలు వెల్లడించారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన మహ్మద్ ఇమ్రాన్, మాదాసు నవీన్, మాదాసు భార్గవి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి మండలం కొండాయిగూడెంనకు చెందిన కుంజా విజయ, పాల్వంచకు చెందిన బత్తుల రాజేశ్వరి ముఠాగా ఏర్పడి తాళం వేసి ఉన్న ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్నారు. గత నెల 20న నర్సంపేటలోని పాకాల సెంటర్‌లో తాళం వేసి ఉన్న దుకాణంలో ఆభరణాలు అపహరించారు. అంతకుముందు, మహబూబాబాద్, ఖానాపురం మండలం బుధరావుపేటలో చోరీలు చేసిన ఈ ముఠా.. ఆభరణాలను విక్రయించేందుకు మహబూబాబాద్ నుంచి వరంగల్ వెళ్తున్నారు. నర్సంపేటలో తనిఖీలు చేస్తుండగా వీరిపై అనుమానంతో ప్రశ్నించగా చోరీల విషయం బయటపడింది. దీంతో ముఠా నుంచి రూ.4.30 లక్షల విలువైన ద్విచక్రవాహనం, ఆటో, ఐదు సెల్‌ఫోన్లు, బంగారం, వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు. సమావేశంలో ఎస్‌ఐలు రవికుమార్, గూడ అరుణ్ పాల్గొన్నారు.

ఏసీబీ దాడులంటూ ప్రచారం

ములకలపల్లి: ములకలపల్లి మండలంలో ఏసీబీ దాడులంటూ మంగళవారం విస్తృతంగా ప్రచారం జరిగింది. రెవెన్యూ శాఖతో పాటు, వివిధ విభాగాల ఉద్యోగులపై ఉన్నతాధికారులు ప్రత్యేక నిఘా పెట్టినట్లు విశ్వసనీయ సమాచారం. చివరకు ఎటువంటి దాడులు లేకపోవడంతో ఆయా శాఖల ఉద్యోగులు ఊపిరి పీల్చుకున్నారు.

ఆరు రోజుల తర్వాత మృతదేహం గుర్తింపు



మృతదేహంతో అన్నం ఫౌండేషన్ సభ్యులు, పోలీసులు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం టేకులపల్లి బ్రిడ్జి సమీపాన సాగర్‌కాల్వలో ఆరు రోజుల క్రితం స్నానం కోసం వెళ్లి గల్లంతైన వ్యక్తి మృతదేహం మంగళవారం లభ్యమైంది. ఖమ్మం వైఎస్సార్ నగర్‌కు చెందిన ఎలగందుల వెంకన్న(60) కాల్వలో స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు గల్లంతయ్యాడు. కొణిజర్ల మండలం రామనర్సయ్యనగర్ సమీపాన కాల్వలో మంగళవారంమాయన మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అప్పటికే మృతదేహం కుళ్లిపోవడంతో అన్నం ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు ఆధ్వర్యాన బయటకు తీసి ఖమ్మం ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఖమ్మం అర్బన్ పోలీసులు తెలిపారు.

నేటి నుంచి గాలికుంటు నివారణ టీకాలు

పాల్వంచరూరల్ : జిల్లా వ్యాప్తంగా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో బుధవారం నుంచి నవంబర్ 14 వరకు గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి డాక్టర్.ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం ఉచితంగా వేసే టీకాలను పశువుల యజమానులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



శ్రీలంక-న్యూజిలాండ్ మ్యాచ్ వర్షార్పణం

కొలంబో: మహిళల వన్డే ప్రపంచకప్‌లో మరో పోరు వర్షార్పణమైంది. కొలంబోలో నిరంతరాయంగా కురుస్తున్న వానలతో రెండోసారి శ్రీలంక ఖాతాలో ఫలితం తేలని మ్యాచ్ చేరింది. మంగళవారం న్యూజిలాండ్, శ్రీలంక మధ్య జరిగిన లీగ్ మ్యాచ్‌ను ఒక ఇన్నింగ్స్ తర్వాత భారీ వర్షం కారణంగా రద్దు చేయాల్సి వచ్చింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న లంక 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 258 పరుగులు చేసింది. నీలాక్షిక సిల్వ (28 బంతుల్లో 55 నాటౌట్; 7 ఫోర్లు, 1 సిక్స్), చమరి అటపట్టు (72 బంతుల్లో 53 ; 7 ఫోర్లు) అర్ధ సెంచరీలు సాధించగా... హాసిని పెరీరా (44),విష్మి గుణరత్నే (42) రాణించారు. కివీస్ బౌలర్లలో సోఫీ డివైన్ 3, బ్రీ ఇల్లింగ్ 2 వికెట్లు పడగొట్టారు. అయితే లంక బ్యాటింగ్ ముగిసిన తర్వాత మొదలైన వర్షం ఆ తర్వాత కొంచెం కూడా తెరిపిని వ్వలేదు. దాంతో న్యూజిలాండ్‌కు బ్యాటింగ్ చేసే అవకాశమే రాలేదు. చివరకు అంపైర్లు మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ నెల 4న కొలంబోలోనే శ్రీలంక, ఆస్ట్రేలియా జట్ల మధ్య మ్యాచ్ కూడా ఒక్క బంతి కూడా పడకుండానే రద్దయింది. కొలంబోలోనే నేడు జరిగే మ్యాచ్‌లో పాకిస్తాన్‌తో ఇంగ్లండ్ ఆడుతుంది.

‘ప్రపంచకప్ టోర్నీకి చాలా సమయం ఉంది’



- రోహిత్, కోహ్లి భవిష్యత్తుపై గంభీర్ వ్యాఖ్య
- రాబోయే సిరీస్‌పైనే దృష్టి పెట్టామన్న హెడ్ కోచ్


న్యూఢిల్లీ: భారత్, ఆస్ట్రేలియా మధ్య ఈ నెల 19 నుంచి మూడు వన్డేల సిరీస్ జరగనుంది. సిరీస్ ఫలితంకంటే విరాట్ కోహ్లి, రోహిత్ శర్మల గురించే ఇప్పుడు చర్చ జరుగుతోంది. చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ తర్వాత మళ్లీ ఈ సిరీస్‌తోనే బరిలోకి దిగుతున్న వీరిద్దరు ఇప్పటికే రెండు ఫార్మాట్‌ల నుంచి రిటైర్ అయి ఒక్క వన్డేలే ఆడుతున్నారు. ఈ క్రమంలో రోహిత్‌ను వన్డే కెప్టెన్సీ నుంచి కూడా తప్పించారు. ఈనేపథ్యంలో తాజా చర్చపై భారత హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ తన అభిప్రాయాన్ని వెల్లడించాడు. ఇప్పటికిప్పుడు వారిద్దరి భవిష్యత్తుపై తానేమీ చెప్పలేనని స్పష్టం చేశాడు. ‘వన్డే వరల్డ్‌కప్‌కు ఇంకా రెండున్నరేళ్ల సమయం ఉంది. కాబట్టి భవిష్యత్తుకంటే ప్రస్తుతంపైనే దృష్టి పెట్టడం ముఖ్యమని నేను భావిస్తా. వారిద్దరు అత్యుత్తమ ఆటగాళ్లు అనడంలో సందేహం లేదు. పునరాగమనం చేస్తున్న వారి అనుభవం ఆస్ట్రేలియాలో పని కొస్తుంది. వీరిద్దరు బాగా ఆడి సిరీస్ విజయంలో భాగమవుతారని ఆశిస్తున్నా’ అని గంభీర్ చెప్పాడు.

గిల్‌కు కెప్టెన్సీ అర్హత ఉంది...

భారత టెస్టు కెప్టెన్సీతో పాటు వన్డేలకు కూడా సారథ్యం వహించే సత్తా, అర్హత శుబ్‌మన్ గిల్‌కు ఉన్నాయని, ఈ హక్కును అతను సాధించుకున్నాడని గంభీర్ ప్రశంసించాడు. ‘కెప్టెన్‌గా గిల్‌ను నియమించి ఎవరూ ఔదార్యం చూపించలేదు. అతడికి ఆ అర్హత ఉంది. కోచ్‌గా కూడా నేను ఈ మాట చెప్పగలను. ప్రపంచ క్రికెట్‌లో అతి కఠినమైన పర్యటనల్లో ఇంగ్లండ్ ఒకటి. అలాంటి చోట ఐదు టెస్టులూ గట్టిగా నిలబడి సిరీస్‌ను సమం చేసుకోగలగడం చిన్న విషయం కాదు. బ్యాటింగ్‌లోనూ అదరగొట్టడంతో పాటు జట్టును సమర్థంగా నడిపి వన్డేల్లోనూ సారథి కాగల హక్కును అతను సాధించాడు’ అని గంభీర్ అన్నాడు. 2027 వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ గురించి ఇప్పుడే మాట్లాడటం అనవసరమని, వరుసగా విజయాలు సాధించడమే తమ లక్ష్యమని అతను స్పష్టం చేశాడు. భారత జట్టు నవంబర్ 9న ఆస్ట్రేలియాతో చివరి టెస్టు ఆడనుండగా... నవంబర్ 14 నుంచి కోల్‌కతాలో దక్షిణాఫ్రికాతో తొలి టెస్టు జరుగుతుంది. అయితే ప్రొఫెషనల్ క్రికెటర్లు తక్కువ సమయంలో పరిస్థితులకు తగినట్లుగా మార్చుకోగలరని విశ్వాసం వ్యక్తం చేసిన గంభీర్... టెస్టు టీమ్‌లో మాత్రమే సభ్యులైన ఆటగాళ్లు రంజీ ట్రోఫీలో బరిలోకి దిగాలని సూచించాడు. వెస్టిండీస్‌తో టెస్టు సిరీస్ గెలవడం పట్ల కోచ్ సంతృప్తి వ్యక్తం చేశాడు. అయితే భారత్‌లో కూడా పేస్ బౌలర్లకు కూడా కాస్త అనుకూలించే విధంగా బౌన్సీ పిచ్‌లు ఉంటే బాగుంటుందని అభిప్రాయం వ్యక్తం చేశాడు.

హర్షిత్ రాణాపై అనవసర విమర్శలు...

భారత జట్టు తరఫున మూడు ఫార్మాట్‌లలోనూ వరుసగా అవకాశాలు పొందుతున్న పేస్ బౌలర్ హర్షిత్ రాణాపై ఇటీవల సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ప్రతిభావంతుడు కాకపోయినా... ఢిల్లీకి చెందినవాడు కావడంతో పాటు గంభీర్ ఐపీఎల్ టీమ్ కేకేఆర్‌కు మెంటార్‌గా ఉన్న సమయంలో సాన్నిహిత్యం వల్లే రాణాకు జట్టులో చోటు దక్కుతుందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. భారత మాజీ కెప్టెన్ కృష్ణమాచారి శ్రీకాంత్ కూడా ఇటీవల ఇదే మాట అన్నాడు. తాజా విమర్శలపై గంభీర్ తీవ్రంగా స్పందించాడు. ఈ వివాదంలో హర్షిత్‌కు అతను పూర్తి మద్దతు పలికాడు. ‘యూట్యూబ్‌లో వ్యూస్ కోసం కొందరు ఒక 23 ఏళ్ల యువ ఆటగాడిని లక్ష్యంగా చేసుకున్నందుకు సిగ్గుపడాలి. రాణా తండ్రి మాజీ క్రికెటర్ కాదు. సెలక్షన్ కమిటీ మాజీ చైర్మన్ కానీ ఎన్‌ఆర్‌ఐ కానీ కాదు. అతను తన ప్రతిభను నమ్ముకొనే క్రికెట్ ఆడుతున్నాడు. ఒక ఆటగాడి ప్రదర్శన బాగా లేకుండా విమర్శించవచ్చు కానీ ఇలా వ్యక్తిగత విమర్శలు చేస్తారా. కావాలంటే నన్ను విమర్శించండి. నేను దానిని భరించగలను. కానీ 23 ఏళ్ల ఆటగాడిపై ఇది మానసికంగా ఎలాంటి ప్రభావం చూపిస్తుందో ఆలోచించారా. భారత క్రికెట్ జట్టు ఎవరిదో సొంత ఆస్తి కాదు. మన జట్టు గెలవాలని భావించే అందరిది ఈ జట్టు అని మర్చిపోవద్దు’ అని గంభీర్ వ్యాఖ్యానించాడు.



లాంఛనం ముగిసింది

రెండో టెస్టులో 7 వికెట్లతో భారత్ జయభేరి

వెస్టిండీస్‌పై 2-0తో సిరీస్ క్లీన్‌స్వీప్ ● కేఎల్ రాహుల్ అర్ధశతకం

న్యూఢిల్లీ: వెస్టిండీస్ మూడో **రోజు ఫాలోఆన్‌లో** రెండో ఇన్నింగ్స్‌తో మొదలుపెట్టిన **పోరాటం** నాలుగో రోజూ కొనసాగడం... **ఇద్దరి సెంచరీల** మైలురాయితో ఆతిథ్య భారత్ **ముందు లక్ష్యాన్ని** ఉంచడంతో ఈ చివరి టెస్టు **చివరి రోజుదాకా** సాగింది. మంగళవారం ఆటలో **భారత్ సులువైన** లక్ష్య ఛేదనలో మిగిలిపోయిన **లాంఛనాన్ని తొలి** సెషన్‌లోనే పూర్తి చేసింది. అలా **రెండో టెస్టులో** టీమిండియా 7 వికెట్ల తేడాతో **వెస్టిండీస్‌పై ఘనవి** జయం సాధించింది. భారత్ **రెండో ఇన్నింగ్స్‌లో** 35.2 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి **124 పరుగులు చేసి** గెలిచింది. ఓవర్‌నైట్ బ్యాటర్ **కేఎల్ రాహుల్ (108** బంతుల్లో 58 నాటౌట్; 6 ఫోర్లు, **2 సిక్స్‌లు) అర్ధ** శతకం సాధించాడు. రోస్టన్ చేజ్ **2 వికెట్లు తీయగా...** వారికెన్‌కు ఒక వికెట్ దక్కింది. **రవీంద్ర జడేజాకు** ‘ప్లేయర్ ఆఫ్ ద సిరీస్’ లభించింది. **రెండు టెస్టుల్లో** ఆడిన ఒకే ఇన్నింగ్స్‌తో శతక్కొట్టిన **జడేజా 8 వికెట్లు** కూడా తీశాడు. కాగా ఈ రెండో **టెస్టులో 8 వికెట్లు** (5/82, 3/104) పడగొట్టిన **కుల్దీప్ యాదవ్‌కు** ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ అవార్డు దక్కింది.

గంటసేపు పైగా...

ఆఖరి రోజు మిగిలిపోయిన 58 పరుగులు చేసేందుకు 63/1 ఓవర్‌నైట్ స్కోరుతో రెండో ఇన్నిం**గ్స్ కొనసాగించిన భారత్ కాసేపటికే సాయి సుద** **ర్శన్ (76 బంతుల్లో 39; 5 ఫోర్లు) వికెట్‌ను కోల్పో**యింది. ఓవర్‌నైట్ బ్యాటర్ రాహుల్‌కు జతయిన కెప్టెన్ శుబ్‌మన్ గిల్ (13) కూడా వికెట్‌ను సమర్పించుకోవడంతో లాంఛనం పూర్తి చేసేందుకు భారత్ గంటసేపు పైగానే ఆడాల్సి వచ్చింది. క్రీజులోకి ధ్రువ్ జురేల్ (6 నాటౌట్; 1 ఫోర్) రాగా... 102 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్న రాహుల్ అజేయంగా **నిలిచి భారత్‌ను గెలిపించాడు. కేఎల్ రాహుల్ తొలి టెస్టులో శతకంతో కదంతొక్కాడు. ఈ క్లీన్‌స్వీప్** విజయంతో టీమిండియా ‘ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్’ పాయింట్ల పట్టికలో 61.9 శాతంతో మూడో స్థానాన్ని పటిష్టం చేసుకుంది.

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్: 518/5 డిక్లేర్డ్; **వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్**: 248; **వెస్టిండీస్ రెండో ఇన్నింగ్స్**: 390; **భారత్ రెండో** ఇన్నింగ్స్: యశస్వి జైస్వాల్ **(సి) ఫిలిప్ (బి)** వారికెన్ 8; రాహుల్ (నాటౌట్) 58; **సాయి సుదర్శన్** (సి) షై హోప్ (బి) చేజ్ 39; గిల్ (సి) గ్రీవ్స్ (బి) చేజ్ 13; ధ్రువ్ జురేల్ (నాటౌట్) 6; ఎక్స్‌ట్రాలు 0; **మొత్తం** (35.2 ఓవర్లలో 3 వికెట్లకు) 124. **వికెట్ల పతనం**: 1-9, 2-88, 3-108. **బౌలింగ్**: సీల్స్ 3-0-14-0, వారికెన్ 15.2-4-39-1, పియర్ 8-0-35-0, చేజ్ 9-2-36-2.

10 వెస్టిండీస్‌పై భారత్ వరుస సిరీస్ విజయాల సంఖ్య. దక్షిణాఫ్రికా పేరిట ఉన్న ఒకే జట్టుపై వరుస సిరీస్ విజయాల రికార్డును భారత్ సమం చేసింది. దక్షిణాఫ్రికా జట్టు కూడా విండీస్‌పై వరుసగా పది సిరీస్‌లలో గెలిచింది.

14 ఢిల్లీ గడ్డపై టీమిండియా అజేయ రికార్డు. భారత్ 1993 నుంచి ఇక్కడ ఆడిన 14 మ్యాచ్‌ల్లో ఒక్కటి కూడా ఓడలేదు. 12 టెస్టులు గెలువగా, రెండు ‘డ్రా’ అయ్యాయి.

122 సొంతగడ్డపై భారత్ గెలిచిన టెస్టులు. సంప్రదాయ క్రికెట్ చరిత్రలోనే ఇది మూడో అత్యధికం. ఆస్ట్రేలియా (262), ఇంగ్లండ్ (241) మాత్రమే ముందున్నాయి.

భారత్-పాకిస్తాన్ హాకీ మ్యాచ్ ‘డ్రా’



జొహోర్ (మలేసియా): సుల్తాన్ ఆఫ్ జొహోర్ కప్ అండర్-21 అంతర్జాతీయ జూనియర్ హాకీ టోర్నీలో భారత్ ఖాతాలో తొలి ‘డ్రా’ చేరింది. చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌తో మంగళవారం జరిగిన మూడో లీగ్ మ్యాచ్‌ను భారత జట్టు 3-3 గోల్స్‌తో ‘డ్రా’గా ముగించింది. భారత్ తరఫున అరిజిత్ సింగ్ (43వ నిమిషంలో), ఆనంద్ (47వ నిమిషంలో), మన్‌మీత్ (53వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. పాకిస్తాన్ తరఫున హన్నాన్ షాహిద్ (5వ నిమిషంలో) ఒక గోల్.. సుఫియాన్ ఖాన్ (39వ, 55వ నిమిషంలో) రెండు గోల్స్ చేశాడు. ఆరు జట్లు పోటీపడుతున్న ఈ టోర్నీలో భారత్ ఏడు పాయింట్లతో ఆస్ట్రేలియాతో కలిసి సంయుక్తంగా అగ్రస్థానంలో ఉంది.

ఆసియా కప్ ఆశలు గల్లంతు

సింగపూర్ చేతిలో ఓడిన భారత్



మార్గావ్: ఆసియా కప్-2027 ఫుట్‌బాల్ టోర్నీకి అర్హత సాధించడంలో భారత్ విఫలమైంది. క్వాలిఫికేషన్ టోర్నీలో రెండో పరాజయంతో జట్టు నిష్క్రమణ ఖాయమైంది. మంగళవారం జరిగిన గ్రూప్ ‘సి’ మ్యాచ్‌లో సింగపూర్ 2-1 గోల్స్ తేడాతో భారత్‌ను ఓడించింది. సింగపూర్ తరఫున సంగ్ యు యంగ్ 44వ, 58వ నిమిషాల్లో గోల్స్ నమోదు చేశాడు. భారత్ తరఫున లాలియన్‌జుల చాంగ్తే 14వ నిమిషంలో ఏకైక గోల్ సాధించాడు. గ్రూప్ ‘సి’లో టీమిండియా చివరి స్థానంలో ఉంది. గ్రూప్ విజేత మాత్రమే ఆసియా కప్‌కు అర్హత సాధిస్తుంది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి సినిమా

అందుకు తెగించే ఇక్కడ ఉన్నాను



- సిద్ధు జొన్నలగడ్డ

‘‘నేను ఏ సినిమా చేసినా నాపై నాకే ఎక్స్‌పెక్టేషన్స్ ఎక్కువగా ఉంటాయి. ఇప్పుడే డీటీఎస్‌లో ‘తెలుసు కదా’ సినిమా చూశాను. చాలా ఎగ్జైట్ అయ్యాను. ఇదే ఎగ్జైట్ మెంట్‌ని ఆడియన్స్ కూడా ఫీలవుతారని అనుకుంటున్నా’’ అని సిద్ధు జొన్నలగడ్డ అన్నారు. సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటించిన చిత్రం ‘తెలుసు కదా’. ఈ చిత్రంలో రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి హీరోయిన్లుగా నటించారు. నీరజా కోన దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్, కృతీ ప్రసాద్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 17న విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం విలేకరుల సమావేశంలో సిద్ధు జొన్నలగడ్డ చెప్పిన విశేషాలు.

● ‘తెలుసు కదా’లో నేను వరుణ్ పాత్రలో కనిపిస్తాను. స్క్రీన్‌పై వరుణ్ మామూలుగా కనిపిస్తున్నప్పటికీ అతని ఆలోచనలు చాలా ర్యాడికల్‌గా ఉంటాయి. ఈ క్యారెక్టరైజేషన్ చూసి, ఆడియన్స్ షాక్ అవుతారనుకుంటున్నాను. ఫస్టాఫ్‌లో శ్రీనిధి, సెకండాఫ్‌లో రాశీ క్యారెక్టర్స్ బలంగా కనిపిస్తాయి. వీరిద్దరి కంటే వరుణ్ రోల్ ఇంకా స్ట్రాంగ్‌గా ఉంటుంది. ● కొత్తవాళ్లతో వర్క్ చేయడం రిస్క్‌తో కూడుకున్న పనే. కానీ రిస్క్ ఉన్న చోటే రివార్డు కూడా ఉంటుంది. నీరజగారి ఐడియాలు బాగున్నాయి. కాకపోతే హీరో క్యారెక్టరైజేషన్‌ను కాస్త ఇంప్రూవ్ చేసిన తర్వాత షూటింగ్‌కు వెళ్లాం. డబ్బుల గురించి ఆలోచించకుండా మంచి సినిమా తీయమని ప్రోత్సహించే నిర్మాత టీజీ విశ్వప్రసాద్‌గారు. అందుకే విజువల్‌గా ‘తెలుసు కదా’ స్క్రీన్‌పై పెద్ద సినిమాలా కనిపిస్తుంది. ● సినిమా మేకింగ్‌లో జోక్యం చేసుకుంటున్నానంటే నా కోసం ఎవరూ కథలు రాయలేదు. నా కథలు నేనే రాసుకున్నాను. ఫిల్మ్ మేకింగ్ గురించిన ప్రతి విషయాన్ని నేర్చుకున్నాను. ఒకవేళ సినిమా హిట్టయితే డైరెక్షన్, మ్యూజిక్, సినిమాటోగ్రఫీ, హీరో హీరోయిన్ల యాక్టింగ్... ఇలా అన్నీ బాగున్నాయి అంటారు. అదే ఫ్లాప్ అయితే నేను ఇన్‌వాల్వ్ అయ్యాను కాబట్టి పోయిందని నిందిస్తారు. ఇందుకు తెగించే ఇక్కడ ఉన్నాను. ● నేను హీరోగా నటించిన ‘డీజే టిల్లు, డీజే టిల్లు 2’ సినిమాలు సూపర్‌హిట్స్‌గా నిలిచాయి. ఈ డీజే టిల్లు క్యారెక్టరైజేషన్ ‘హై’ వల్ల నా సినిమాలు ఒకట్రెండు ఫలితాలు తారుమారు కావొచ్చని ముందే ఊహించాను. ‘జాక్’ సినిమా ఆడియన్స్‌ను మెప్పించలేకపోయింది. అప్పుడు కొరటాల శివగారు ఫోన్ చేసి, ‘డీజే టిల్లు’ హిట్స్‌తో ఆల్ టైమ్ ‘హై’ చూశావ్... ‘జాక్’తో ‘లో’ చూశావ్. ఇక నువ్వేం చేసినా ఆ రెండింటి మధ్య చూస్తావు’’ అన్నారు. ఆ మాటలు నాలో కొత్త ఆలోచనలు కలిగించాయి. ● ఇటీవల ఓ ఇబ్బందికర ప్రశ్న ఎదుర్కొన్నాను. సినిమాల్లో హీరో పోలీసాఫీసర్ అయితే రియల్‌గానూ పోలీస్‌గా ఉంటారా? హీరో డ్రగ్ ఎడిక్ట్ అయితే రియల్ లైఫ్‌లోనూ డ్రగ్ ఎడిక్టై ఉంటారా? అది సినిమా. హీరో ఆన్సర్ చేసే పొజిషన్‌లో ఉన్నాడు కదా అని ఏది పడితే అది అడిగేయడం కరెక్ట్ కాదు. ● ‘తెలుసు కదా’ ప్రమోషన్స్‌లో భాగంగా రవితేజగారి బయోపిక్ చేయాలని ఉందని చెప్పాను... చూడాలి. ఇక నాకు డైరెక్టర్‌గా మారే ఆలోచన కూడా ఉంది. హీరోగా నా తర్వాతి సినిమా ‘బ్యాడాస్’ కొత్తగా ఉంటుంది. మల్లిక్ రామ్‌తో ఓ సినిమా చేయాల్సి ఉంది.

ఫ్లాష్‌బ్యాక్‌లో యాక్షన్



● ఎన్టీఆర్

ఎన్టీఆర్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం ‘ఎన్టీఆర్ నీల్’ (వర్కింగ్ టైటిల్). ‘కేజీఎఫ్, సలార్’ చిత్రాల తర్వాత డైరెక్టర్ ప్రశాంత్ నీల్ దర్శకత్వం వహిస్తున్న సినిమా ఇది. రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్స్‌పై కల్యాణ్ రామ్ నందమూరి, నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి, హరికృష్ణ కొసరాజు నిర్మిస్తున్న పాన్ ఇండియా చిత్రమిది. ఈ సినిమాలో వచ్చే ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్స్ కోసం ఎన్టీఆర్ ఓ డిఫరెంట్ లుక్‌లోకి మారారని టాక్. ఫ్లాష్‌బ్యాక్‌లో వచ్చే పవర్‌ఫుల్ యాక్షన్ సన్నివేశాలు సినిమాలో హైలెట్‌గా నిలవనున్నాయట. ఇదిలా ఉంటే... ఈ సినిమాకి ‘డ్రాగన్’ అనే టైటిల్ పరిశీలనలో ఉన్నట్లు ఫిల్మ్ నగర్ టాక్. ఈ చిత్రం 2026 జూన్ 25న తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

‘వార్ 2’ రికార్డ్ : హృతిక్ రోషన్, ఎన్టీఆర్, కియారా అద్వానీ ముఖ్య తారలుగా నటించిన చిత్రం ‘వార్ 2’. అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో యశ్ రాజ్ ఫిల్మ్స్‌పై ఆదిత్య చోప్రా నిర్మించిన ఈ సినిమా ఆగస్టు 14న విడుదలైంది. ఈ సినిమా నెట్‌ఫ్లిక్స్ ఓటీటీ వేదికగా ఈ నెల 6 నుంచి స్ట్రీమింగ్ అవుతోంది. అత్యధిక మంది వీక్షించిన చిత్రాల జాబితాలో ‘వార్ 2’ చిత్రం టాప్‌లో ఉన్నట్లు ప్రముఖ మీడియా సంస్థ ఆర్మాక్స్ తెలిపింది. ఈ నెల 6 నుంచి 12 వరకూ 3.5 మిలియన్ల మంది వీక్షించినట్లు ఆ సంస్థ ప్రకటించింది. దీంతో గత వారం ఇండియాలోనే ఎక్కువ మంది చూసిన సినిమాగా ‘వార్ 2’ నిలిచింది.

కుందేలుకి కోపం వస్తే..!



● చిరంజీవి, నయనతార

‘‘మీసాల పిల్లా నీ ముక్కు మీద కోపం కొంచెం తగ్గాలే పిల్లా... మీసాల పిల్లా నీ ముక్కు మీద కోపం కొంచెం తగ్గాలే పిల్లా... పొద్దునలేచిన దగ్గర్నుంచి డైలీ యుద్ధాలా... మొగుడు పెళ్లాలంటే కంకీ కొడవల్లా... అట్ల కన్నెర చెయ్యాలా... కారాలే నూరేలా...’’ అంటూ సాగుతుంది ‘మీసాల పిల్లా...’ పాట. చిరంజీవి హీరోగా నటిస్తున్న ‘మన శంకరవరప్రసాద్‌గారు’ సినిమాలోనిది ఈ పాట. ఈ చిత్రంలో నయనతార హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఇందులో చిరంజీవి, నయనతార భార్యా భర్తలుగా కనిపిస్తారు. ఈ సినిమాలోని ‘మీసాల పిల్లా...’ పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు మేకర్స్. భీమ్స్ సిసిరోలియో స్వరపరచిన ఈ పాటకు భాస్కరభట్ల సాహిత్యం అందించగా ఉదిత్ నారాయణ్ ఆలపించారు. ‘‘ఇట్ట దుమ్మెత్తి పొయ్యాలా దూరాలె పెంచేలా... కుందేలుకి కోపం వస్తే చిరుతకు చెమటలు పట్టేలా...’ అంటూ ఈ పాట సాగుతుంది. అర్చన సమర్పణలో అనిల్ రావిపూడి దర్శకత్వంలో సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్న ‘మన శంకరవరప్రసాద్‌గారు’ సినిమా వచ్చే సంక్రాంతి సందర్భంగా విడుదల కానుంది.

కబడ్డీ... కబడ్డీ



● ధృవ్

ప్రముఖ తమిళ హీరో విక్రమ్ తనయుడు ధృవ్ హీరోగా అనుపమా పరమేశ్వరన్ హీరోయిన్‌గా నటించిన చిత్రం ‘బైసన్’. మారి సెల్వరాజ్ దర్శకత్వం వహించారు. పా. రంజిత్ సమర్పణలో నీలం స్టూడియోస్, అప్లాజ్ ఎంటర్‌టైన్మెంట్‌పై సమీర్ నాయర్, దీపక్ సెగల్, పా. రంజిత్, అదితీ ఆనంద్ నిర్మించిన ఈ చిత్రం తమిళంలో ఈ నెల 17న విడుదల కానుంది. తెలుగులో జగదాంబే ఫిలిమ్స్ పై బాలాజీ ఈ నెల 24న విడుదల చేస్తున్నారు. ఈ సినిమా ట్రైలర్‌ను హీరో రానా రిలీజ్ చేసి, సినిమా విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ- ‘‘1990 బ్యాక్‌డ్రాప్‌లో కబడ్డీ నేపథ్యంలో రూపొందిన చిత్రం ‘బైసన్’. ట్రైలర్ ఎంత ఆసక్తికరంగా ఉందో సినిమా కూడా థ్రిల్లింగ్ అంశాలతో అందర్నీ ఆకట్టుకునేలా ఉంటుంది. స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్ సినిమాలకు తెలుగులో మంచి ఆదరణ దక్కుతుంది. కబడ్డీ నేపథ్యంలో రాబోతున్న మా సినిమా కూడా మంచి విజయం అందుకుంటుందని నమ్ముతున్నాను’’ అన్నారు.

ఫ్యామిలీ ఆడియన్స్ చూడొచ్చు

- నిర్మాత రాజేశ్ దండ

‘‘నిర్మాతగా ‘కె-ర్యాంప్’ నాకు ఆరవ సినిమా. నా గత ఐదు చిత్రాల్లో ఎక్కడా ఇబ్బందికరమైన పదాలు లేవు. ఒక్కో సినిమా కథ ఒక్కోలా ఉంటుంది. అంతే కానీ కావాలని కొన్ని పదాలు పెట్టి, ప్రేక్షకులను థియేటర్స్‌కు రప్పించాలని అనుకోను. అలాంటి సినిమాలు నేను తీయను. ‘కె-ర్యాంప్’ చిత్రం ఫ్యామిలీ ఆడియన్స్ చూడొచ్చు’’ అని చెప్పారు నిర్మాత రాజేశ్ దండ. కిరణ్ అబ్బవరం, యుక్తీ తరేజా హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం ‘కె-ర్యాంప్’. జైన్స్ నాని దర్శకత్వంలో రాజేశ్ దండ, శివ బొమ్మకు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 18న విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో రాజేశ్ దండ మాట్లాడుతూ- ‘‘ఈ చిత్రంలో కిరణ్‌గారు కుమార్ అబ్బవరం అనే పాత్రలో నటించారు. ఈ సినిమా కథ విని ఎగ్జైట్ అయ్యాను. మా సినిమాకు సెన్సార్ వాళ్ళు ‘ఏ’ సర్టిఫికెట్ ఇచ్చింది ఇందులో ఇబ్బందికరమైన పదాలు ఉన్నాయని కాదు. ఈ చిత్రంలో కొన్ని సన్నివేశాలు ఉన్నాయి. వీటిని చూసి ఎవరైనా ఆడియన్స్ ప్రేరణ పొందుతారేమోనని ‘ఏ’ సర్టిఫికెట్ ఇచ్చారు... అంతే. వల్గారిటీ లేదు. ఇక ‘కె-ర్యాంప్’ సినిమా కిరణ్‌గారి వన్ మ్యాన్ షోలా ఉంటుంది. ఇంట్రవెల్ బ్యాంగ్ బ్లాస్ట్ అవుతుంది. ఈ సినిమాతో నిర్మాత శివతో నాకు మంచి ప్రయాణం మొదలైంది. నా మీద నమ్మకంతో కథ వినకుండానే ఈ సినిమాలో భాగమయ్యారు శివ. ప్రస్తుతం మా బ్యానర్‌లో హీరోయిన్ సంయుక్తతో ఓ సినిమా చేస్తున్నాం. అలాగే ‘అల్లరి’ నరేశ్‌గారితో ఓ సినిమా ఉంది’’ అని అన్నారు. ఇంకా మాట్లాడుతూ- ‘‘టార్గెటెడ్ ట్రోలింగ్ గురించి బన్నీ వాసుగారు మాట్లాడిన విషయాలను నేను ఫాలో కాలేదు. పూర్తి విషయాలు తెలిసిన తర్వాత స్పందిస్తాను’’ అని చెప్పారు. ‘‘కిరణ్‌గారిని ఈ సినిమాలో కొత్తగా చూస్తారు. అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించేలా ఈ సినిమా ఉంటుంది’’ అన్నారు శివ బొమ్మకు.



● రాజేశ్ దండ, శివ బొమ్మకు

అరి కథతో పుస్తకం తీసుకొస్తున్నాం

- జయశంకర్

‘‘అరిషడ్వర్గాల గురించి ఎంతోమంది గొప్పవాళ్లు చెబుతూ వచ్చారు. కానీ, వాటికి పరిష్కారం చూపించలేదు. ఈ ఆలోచనతోనే ‘అరి’ చిత్రాన్ని రూపొందించాను. ఈ సినిమా కథతో త్వరలోనే పుస్తకాన్ని తీసుకొస్తున్నాం’’ అని దర్శకుడు జయశంకర్ చెప్పారు. వినోద్ వర్మ, అనసూయ, సాయి కుమార్, శ్రీకాంత్ అయ్యంగార్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం ‘అరి’. రామిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి (ఆర్‌వీ రెడ్డి) సమర్పణలో శ్రీనివాస్ రామిరెడ్డి, డి. శేషురెడ్డి మారంరెడ్డి, డా. తిమ్మప్ప నాయుడు పురిమెట్ల, బీరం సుధాకర్ రెడ్డి నిర్మించారు. ఏషియన్-సురేష్ డిస్ట్రిబ్యూషన్ ద్వారా ఈ నెల 10న విడుదలైంది. ఈ సినిమా సక్సెస్ మీట్‌లో జయశంకర్ మాట్లాడుతూ- ‘‘మా సినిమాకి స్లోగా ఓపెనింగ్స్ వచ్చి పికప్ అవుతుందనుకున్నాం. అయితే శ్రీకాంత్ అయ్యంగార్ ఇష్యూ వల్ల రెండో రోజునే మా సినిమా పోస్టర్స్‌ను థియేటర్స్ దగ్గర చించివేయడం బాధగా అనిపించింది. ఆ తర్వాత ఆ వివాదం సద్దుమణిగింది. మూడో రోజు నుంచి మా సినిమాకి ప్రేక్షకుల సందడి కనిపించింది’’ అని పేర్కొన్నారు. ‘‘పేపర్ బాయ్’లో అవకాశం ఇచ్చి, నాకు గుర్తింపు తీసుకొచ్చిన జయశంకర్‌గారు ఇప్పుడు ‘అరి’లో లీడ్ రోల్ ఇచ్చి మరింత గుర్తింపు తెచ్చుకునేలా చేసినందుకు థ్యాంక్స్’’ అని నటుడు వినోద్ వర్మ తెలిపారు.



● వినోద్ వర్మ, జయశంకర్

సస్పెన్స్ సీమంతం



● సుధాకర్, ఆర్పీ పట్నాయక్

‘‘ప్రస్తుతం సమాజంలో నెలకొన్న ఓ ప్రధానమైన సమస్య నేపథ్యంలో రూపొందిన ‘సీమంతం’ సినిమా మంచి విజయం సాధించాలి. ‘ఎద మాటున...’ పాట బాగుంది. ఈ చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించాలి’’ అని సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్ తెలిపారు. వజ్రయోగి, శ్రేయ భర్తీ జంటగా సుధాకర్ పాణి దర్శకత్వం వహించిన చిత్రం ‘సీమంతం’. ప్రశాంత్ టాటా నిర్మించిన ఈ సినిమా నవంబరు 14న విడుదల కానుంది. ఎస్. సుహాస్ సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి ‘ఎద మాటున...’ అంటూ సాగే పాటని ఆర్పీ పట్నాయక్ రిలీజ్ చేశారు. ‘‘సస్పెన్స్ క్రైమ్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం ‘సీమంతం’. గర్భవతులపై దాడుల నేపథ్యంలో కథ సాగుతుంది’’ అని యూనిట్ పేర్కొంది.